సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



అడవికి నిప్పు

సిద్దవటం రేంజి పరిధిలోని మద్దూరు, సిద్దవటం బీట్‌లలో ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టారు. సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని రేంజర్ తెలిపారు. -8లో



విజేత 'అన్నమయ్య'

వశిష్ట పాఠశాలలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల,బాలికల షూటింగ్‌బాల్ పోటీల్లో అన్నమయ్య జట్టు విజేతగా నిలిచింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.116
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 324 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనూ ప్రజలు ఫిర్యాదులను అందజేయొచ్చని వివరించారు.

14 నుంచి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీరప్రదీప్, ఆలయ ధర్మకర్తలు

రాజంపేట రూరల్: శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను మే 10వ తేది నుంచి 14వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారుడు పసుపులేటి వీరప్రదీప్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని భువనగిరిపల్లి వద్ద నున్న లక్ష్మనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను, లగ్నపత్రికలను ఆలయ ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేది కన్నుల పండువగా కల్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని భక్తులు, మహిళలు ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు.

11న దూదేకుల విద్యార్థులకు పురస్కారం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులకు మే 11న నగరంలోని ఎర్రముక్కపల్లె దూదేకుల జిల్లా భవన్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఏపీ నూర్ బాషా దూదేకుల, బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గటూరి చిన్న రాజా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘంతోపాటు కడప నూర్ భాష దూదేకుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో 950, పదో తరగతిలో 560కు పైగా మార్కులు సాధించిన వారు మే 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440677839, 9441276127, 7780441172, 9951667362 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, నాయకులు ఖాదరయ్య, ఓబులేసు, కమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముడిపట్టు మోత... మగ్గాల మూత



- పట్టుచీరలకు మద్దతు ధర కరువు
- ఆదుకోని కూటమి సర్కారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తంతో ఊరట



దారం తీస్తున్న నేత కార్మికురాలు



ఆగిన చేనేత మగ్గం

మదనపల్లె సిటీ: పట్టు చీరల తయారీలో వినియోగించే ముడిపట్టు ధర ఆకాశన్నంటుతోంది. వార్పు, రేషం ధరలు అమాంతంగా పెరిగి తయారీదారులకు చుక్కలు చూపిస్తోంది. చేనేత పరిశ్రమ కోలుకుంటున్న దశలో ముడిపట్టు ధర పెరగడంతో చీరలు తయారు చేసి, విక్రయించే సొంత మగ్గందారులు నష్టాలు చూస్తున్నారు. ముడి పట్టు ధరకు అనుగుణంగా చీరల ధరలు పెరగకపోవడంతో తయారీదారులపై భారం పడుతోంది.

- మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. కార్మికులకు రోజుకూలి రావడం కూడా గగనమైపోతోంది. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రధాన చేనేత కేంద్రాలు మదనపల్లె (నీరుగట్టువారిపల్లె),కలకడ, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కురబలకోట, బి.కొత్తకోట,పుల్లంపేట, చిన్నమండ్యం, గాలివీడు, సంబేపల్లి, రాజంపేట, వీరబల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 18 వేలకుపైగా చేనేతమగ్గాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికిపైగా కార్మికులు, అనుబంధ రంగాల వారు చేనేతరంగంపై ఆధారపడి పని చేస్తున్నారు.

భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం

పట్టుచీరల తయారీకి ఉపయోగించే ముడిపట్టు (వార్పు, రేషం, జరీ) ధరలు ఏడాది కాలంలో 20 శాతానికిపైగా పెరిగాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టు చీరలకు వినియోగించే రంగులు, రసాయనాలు, ఇతర ముడి సరుకు ధరలు అమాంతంగా పెరిగాయి. గత ఏడాది రేషం రూ.3,500 వార్పు కిలో 3,800 ఉండగా, ప్రస్తుతం రూ.4,800, రూ.6,200 చేరాయి. గతంలో మార్కు జరీ రూ.550 నుంచి రూ.600 ఉండగా ప్రస్తుతం రూ.700 నుంచి రూ.750 పలుకుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అనతి కాలంలోనే 20 శాతానికిపైగా ధరలు ఎగబాకడంతో కార్మికులకు ఉపాధి భారమైంది.

నేతన్న నేస్తంతో పరిస్థితి మెరుగ్గా...

ముడిపట్టు ధరలు పెరగడం, తగ్గడం సహజంగా జరుగుతుంటుంది. ఈ ఒడిదుడుకులను తట్టుకునేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా అప్పటి సీఎం వైఎస్‌జగన్ ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ముడి పట్టురాయితీని ఒకేసారి బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆదుకునే వారు. ఇలా ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా సాయం అందించారు. కరోనా వంటి కష్టకాలంలో రెండు నెలలు ముందుగానే నేతన్న నేస్తం నిధులు కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. ఫలితంగా చేనేత కార్మికులు ప్రభుత్వం అందించిన సాయంతో చేనేత మగ్గాలను ఆధునీకరించుకుని గతంలో కంటే మెరుగైన డిజైన్‌లను వేసుకుని ఎక్కువ లాభం సంపాదించి అభివృద్ధి చెందారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో నేతన్న నేస్తం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు
2021	5837	రూ.14,00,88,000
2022	6118	రూ.14,68,32,000
2023	6937	రూ.16,64,88,000

కూటమి సర్కార్ చిన్నచూపు

కూటమి సర్కార్ చేనేతలను చిన్నచూపు చూస్తోంది. కార్మికులను ఎంతగానో ఆదుకున్న నేతన్న నేస్తం పథకానికి సైతం మంగళం పాడింది. దీంతో ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడం ..ముడిపట్టు ధరలు పెరుగుతుండడంతో చేనేతలు పీకల్లోతు నష్టాల్లోకి జారిపోయారు. దీంతో చాలా మంది కార్మికులు రేషం, వార్పు ధరలు తగ్గే వరకు మగ్గాలు నిర్వహించకుండా ఆపేస్తున్నారు. మరికొందరు రాత్రింబవళ్లు మగ్గం నేస్తూ తక్కువ కూలీతోనే బతుకు వెళ్లదీస్తున్నారు. ఇంతటి దయనీయమైన పరిస్థితులను చూసిన దాఖలాలు ఎప్పుడూ లేవని చేనేతలు వాపోతున్నారు.

హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ముడి పట్టు, వార్పు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలి.

– శీలం రమేష్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు

చేనేత మనుగడ కష్టమే



చేనేతరంగం మనుగడ కష్టంగా మారింది. మగ్గాల నిర్వహణ కష్టతరంగా ఉంది. ముడి పట్టు రాయితీ కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం చేనేతలను పట్టించుకోకపోవడం బాధాకరం.

–దండు రామాంజులు, చేనేత సంఘ నాయకులు

ఇబ్బందులు పడుతున్నాం



ఏడాది కాలంగా ముడి పట్టు ధరలు విపరీతంగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజంతా మగ్గం నేసినా కూలి కూడా రావడం లేదు. ప్రభుత్వం ముడిపట్టు రాయితీని అందించాలి. –లక్ష్మి, చేనేత కార్మికురాలు

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకి సేవ



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పల్లకీ సేవ నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేశారు. రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిక్కు, జైను, పార్సీ మైనార్టీల సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ హిదాయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి వయసు 21–55 ఏళ్ల మధ్య ఉండాలని, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలుగా నిర్ణయించారన్నారు. రూ.లక్ష యూనిట్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల యూనిట్ ఖర్చు వరకు గరిష్ఠంగా రూ.1.25 లక్షలు సబ్సిడీ, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు యూనిట్ ఖర్చుకు గరిష్ఠంగా రూ.2 లక్షల సబ్సిడీ, రూ.5 నుంచి రూ.8 లక్షల యూనిట్ 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యా సంస్థలకు వేసవి సెలవుల నేపథ్యంలో పలు విహార ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కడప డిపో నుంచి గోవా, ఊటీ, వేలాంగిణి, అరుణాచలానికి బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు.

- మే 9న కడప నుంచి గోవాకు ఇంద్ర (50301) సర్వీసు బయలుదేరుతుందని, ఇందులో రూ.4200 చార్జిగా నిర్ణయించామన్నారు. అదే రోజు బెంగళూరు, మైసూరు మీదుగా ఊటీకి సూపర్ లగ్జరీ సర్వీసు రాత్రి 7 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇందులో చార్జిగా రూ.2400గా ఉంటుందన్నారు. మే 9నే వేలాంగిణికి ఇంద్ర (950066) బస్సు బయలుదేరుతుందని వివరించారు.

జీడీఎస్‌ల సంక్షేమమే లక్ష్యం



కుర్చీలను అందజేస్తున్న అవటాల చెన్నారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్: తపాలా శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్ (జీడీఎస్) శ్రేయస్సే ముఖ్యమని భారతీయ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం ప్రజా చైతన్య సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం జీడీఎస్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు డిపార్ట్‌మెంట్ టార్గెట్లు తదితర అంశాలపై చర్చించారు. జీడీఎస్‌లు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా కొన్ని పథకాలకు ఇన్సెంటివ్ ఇస్తూ పనిభారం లెక్కించడం లేదన్నారు. త్వరలో పోస్టల్ శాఖలో వినూత్న మార్పులు వస్తున్నాయని తెలిపారు. అవటాల చెన్నారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బ్రాంచ్ పోస్టాఫీస్‌లకు 63 కుర్చీలు సభ్యులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో బీటీ పల్లి, రామాపురం, వీరబల్లి, మాసాపేట, రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం సబ్ పోస్టాఫీస్ పరిధిలోని జీడీఎస్‌లు పాల్గొన్నారు.

సర్కారు నిర్లక్ష్యం.. మూగజీవాలకు శాపం!

- సంచార పశు వైద్య సేవ వాహనాలకు గడువు ముగిసినా పట్టించుకోని ప్రభుత్వం
- పల్లెల్లో కరువవుతున్న పశువైద్యం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశు యజమానులు



పశు వైద్యసంచార వాహనం

సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ మూగ జీవుల పైనా తన ప్రతాపం చూపిస్తోంది. సంచార పశువైద్య వాహనాలను మూలకు నెట్టి వైద్య సేవలను అటకెక్కించింది. ఫలితంగా సమయానికి వైద్యం అందక మూగ జీవాలు అలమటిస్తున్నాయి. మూగజీవాలకూ అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రణాళిక అమలు చేసింది. 2022 మే 19వ తేదీన సంచార పశు వైద్య వాహనాలకు శ్రీకారం చుట్టింది. మహోన్నత ఆశయంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచార వాహనాలతో ఉత్తమ వైద్యానికి చర్యలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గానికి ఒక వాహనాన్ని కేటాయించి గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కడైతే పశువుకు బాగాలేదో ఆ ఇంటి వద్దనే వైద్యం అందించాలని సంచార పశు వైద్య వాహనాన్ని అప్పగించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలందిస్తున్న సంచార పశు వైద్య వాహనాలను ప్రస్తుత కూటమి సర్కార్ పట్టించుకోవడం మానేసింది. ఫలితంగా రెండు నెలలుగా వాహనాలు మూలకు చేరాయి. కాంట్రాక్టు గడువు ముగియడంతో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు వీటిని నిలిపివేశారు. ప్రస్తుతానికి జిల్లా అంతటా ఏడు వాహనాలతో అరకొర వైద్య సేవలు అందుతున్నాయి.

పశు యజమానులకు కష్టకాలం

జిల్లాలో లక్షల సంఖ్యలో కోళ్లు, గేదెలు, ఆవులు, ఎద్దులు, ఇతర పెంపుడు జంతువులు ఉన్నాయి. సంచార పశు వైద్య వాహనం ద్వారా ఎక్కడికక్కడ సమస్య ఉన్నచోటనే..జంతువును వాహనంలోకి హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఎక్కించి అక్కడే అన్ని పరీక్షలు చేసేవారు. పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను కూడా సంచార వాహనంలో అందుబాటులో ఉంచారు. హైడ్రాలిక్ లిఫ్ట్ సిస్టమ్ ఉండడంతో ఆవు, గేదె వాహనంలోకి సులువుగా ఎక్కించేందుకు వీలు ఉండేది. అత్యున్నత టెక్నాలజీతో వాహనాన్ని తీర్చిదిద్దారు. అయితే దీనికి 108, 104 తరహాలోనే ఒక నంబరును కేటాయించి ఫోన్ చేయగానే గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో అరకొర వాహనాలతో తూతూ మంత్రంగా వైద్యసేవలందుతున్నాయి. గ్రామీణ ప్రాంత పశువులకు, ఇతర జంతువులకు ఉపయోగపడే ఈ పథకంపై ప్రస్తుత సర్కార్ నిర్లక్ష్యం చూపడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంచార పశు వైద్య వాహనాల కాంట్రాక్టు పొడిగించడంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో అంతుచిక్కడం లేదని పలువురు పశువుల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో పశువుల సమాచారం

గేదెలు:	100588
కోళ్లు:	30,82,260
ఎద్దులు, ఆవులు:	276417
గొర్రెలు:	18,24,325
మేకలు:	3,53,370



పశువులకు తప్పని ఇబ్బందులు



వైఎస్ జగన్ హయాంలో రైతులకు వరంగా ఉన్న పశు ఆరోగ్య సంచార వాహనాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కారణంగా పశు వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో పశువుల వద్దకే వచ్చి సేవలు అందించేవారు. ముఖ్యంగా పశువైద్య శాలలు అందుబాటులో లేని ప్రాంతాలకు వరంగా ఉండేవి. టోల్ ఫ్రీ నంబరు ఉండేది. మారుమూల గ్రామలకు వెళ్లి తగిన సేవలు చేస్తూ వచ్చారు. ఉన్నట్టుండి సంచార వాహనాలను నిలిపి వేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది.

– మొలక గోపాల్ రెడ్డి, పాడి ఆవుల రైతు, మొలకవారిపల్లె, కురబలకోట మండలం

మే 1 నుంచి అందుబాటులోకి వాహనాలు



జిల్లాలో ప్రస్తుతం ఫిబ్రవరి 1 నుంచి ఆగిపోయిన ఆరు పశు సంచార వాహనాలను మే నెల 1వ తేదీ నుంచి నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రస్తుతం కాంట్రాక్టు కుదిరింది. ఈ నేపథ్యంలో మేనెల నుంచి వీటిని నడిపేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుతానికి ఏడు వాహనాలతో జిల్లాలో వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాం. మిగిలినవి కూడా అందుబాటులోకి వస్తే పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తాం.

– గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

నకిలీ సర్టిఫికెట్ల కలకలం

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో చేపడుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ నియామకాల్లో.. నకిలీ సర్టిఫికెట్స్ వెలుగు చూడటం కలకలం రేపుతోంది. కొంత మంది అన్ని వ్యవహారాల్లో ఆరితేరి.. అడ్డదారుల్లో అక్రమంగా సంపాదించుకోవడానికి ఒక ముఠాగా ఏర్పడి.. వీటిని తయారు చేస్తున్నట్లు వినికిడి. దీంతో అప్రమత్తమైన ఆ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో.. ఈ వ్యవహారం బయటపడింది.

- స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీలో వెలుగులోకి..
- ధ్రువీకరించిన హెల్త్ యూనివర్సిటీ
- కొందరి హస్తలాఘవంతో తయారీ
- వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అప్రమత్తం





వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4(రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఈ ఏడాది జనవరిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ నియామకాలకు చర్యలు చేపట్టారు. మొత్తం 150 పోస్టులకు గాను 11 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆ కార్యాలయ సిబ్బంది పరిశీలించి జాబితా సిద్ధం చేయడానికి పెద్ద కసరత్తే చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రెండు విడతలుగా పెద్ద ఎత్తున నియామకాలు జరిగాయి. ఆ పరంపరలోనే తాజాగా నియామకాలకు శ్రీకారం చుట్టారు.

అనుమానంతో...

వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిబంధనల ప్రకారం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 11 వేలకు పైగా వచ్చిన దరఖాస్తుల్లో 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయాలి. అందులో భాగంగా 200 మందితో అభ్యర్థుల తుది ఎంపిక జాబితా సిద్ధం చేశారు. 200 మందితో జాబితా ఎందుకంటే.. 150 మందిలో కౌన్సెలింగ్‌కు ఎవరైనా అభ్యర్థులు రాకపోతే, ప్రాధాన్యత ప్రకారం మిగతా వారికి ఆ స్థానంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి ముందస్తుగా ఎక్కువ మందితో జాబితా సిద్ధం చేయడం జరుగుతుంది. ఆ ప్రకారం అర్హులైన 200 మందితో తుది జాబితా తయారు చేశారు. ఇక ఆ జాబితాను ప్రకటించి నియామక కౌన్సెలింగ్‌ను చేపట్టడమే. అయితే ఆ శాఖ అధికారులకు అనుమానం రావడంతో ఎందుకైనా మంచిదని, ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ధ్రువీకరణ కోసం బోర్డుకు పంపారు. అందులో భాగంగా 100 మంది బీఎస్సీ నర్సింగ్, మరో 100 మంది జీఎన్‌ఎమ్ నర్సింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను.. పరిశీలన కోసం పారామెడికల్ బోర్డు, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పంపారు. బీఎస్సీ నర్సింగ్‌కు సంబంధించి 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పంపగా, అందులో 20 మంది సర్టిఫికెట్స్ బోగస్‌గా నిర్ధారించారు. జీఎన్‌ఎం నర్సింగ్ కోర్సు చేసిన 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను పారా మెడికల్ బోర్డుకు పంపగా, అక్కడి అధికారుల నుంచి సమాధానం రావాల్సి ఉంది. అందులో కూడా పెద్ద సంఖ్యలోనే నకిలీ సర్టిఫికెట్స్ ఉన్నట్లుగా తెలుస్తోంది.

కొందరు ఉద్యోగులు.. ముఠాగా ఏర్పడి..

గతంలో కూడా బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. కొంత మంది ఉద్యోగులు ఒక ముఠాగా ఏర్పడి బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారానికి సంబంధించి కొందరు ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశాలపై 'సాక్షి' పలు కథనాలను ప్రచురించింది. ఇప్పుడు కూడా వారే ఈ బోగస్ వ్యవహారానికి తెరలేపారనే ప్రచారం ఆ శాఖకు చెందిన ఉద్యోగుల్లో నడుస్తోంది. నిరుద్యోగుల ఆశలను ఆసరాగా తీసుకొని కొందరు మోసానికి పాల్పడుతున్నారు. అడ్డంగా దోచుకుంటున్నారు. 'అధికారం మాదే' అనే మదంతో కొంత మంది ఒక్కో పనికి లెక్కకట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం.

మార్కుల జాబితా మాయ

మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. జీఎన్ఎం కోర్సుకు 1800, బీఎస్సీ నర్సింగ్‌కు 2,700 మార్కులు ఉంటాయి. ఉద్యోగ నియామకాల్లో ఈ మార్కులతోపాటు సర్వీస్, అకడమిక్ వెయిటేజ్ మార్కులు ఉంటాయి. అలాగే కోవిడ్ కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపట్టిన విధుల కాలాన్ని బట్టి మార్కులు ఉంటాయి. ఈ మార్కుల మెరిట్‌తోపాటు ఇతర నిబంధనలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ మార్కులకు ప్రాధాన్యత ఉంటుంది. దీంతో అభ్యర్థులు నకిలీ మార్కుల జాబితాను సమర్పించినట్లుగా సమాచారం. బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతకు సంబంధించి మొత్తం 20 మంది బోగస్ సర్టిఫికెట్స్‌ను సమర్పించగా.. అందులో నలుగురు కరోనా డ్యూటీలకు సంబంధించి బోగస్ సర్టిఫికెట్స్ పొందుపరిచినట్లుగా సమాచారం. ఇలా మార్కుల జాబితా ఒక మాయలా మారింది. దీని ఫలితంగానే షెడ్యూల్ ప్రకారం ఎప్పుడో జరగాల్సిన నియామకాల కౌన్సెలింగ్ వాయిదా పడుతూ వచ్చింది.

అవును.. నిజమే..!



బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూసిన మాట వాస్తవమే. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నియామకాలు చేపట్టకముందే.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన కోసం బోర్డుకు పంపాం. అక్కడ బోగస్ సర్టిఫికెట్స్ అని తేలాయి. ఇంకా నిర్ధారణ కావాల్సిన సర్టిఫికెట్స్ ఉన్నాయి. ఆ వివరాలు రాగానే చట్టపరమైన చర్యలు చేపడతాం. అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరకముందే.. సర్టిఫికెట్స్ పరిశీలన చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ చర్యలు చేపట్టాం.

– డాక్టర్ రామగిడ్డయ్య, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

క్లుప్తంగా

మహిళపై దాడి

పెద్దతిప్పసముద్రం : బహిరంగ ప్రదేశంలో ఓ మహిళపై విచక్షణా రహితంగా దాడి చేసిన కోనప్ప (40)పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ..మండలంలోని బూచిపల్లికి చెందిన శకుంతల అనే వితంతు మహిళను అదే గ్రామానికి చెందిన ఆమె దాయాది కోనప్ప ముళ్ల కంపల్లో ఈడ్చుకుంటూ వెళ్లి దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెకు చెందిన రాజశేఖర్ భార్య సుమతి (28) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగింది. అదే విధంగా తట్టివారిపల్లెకు చెందిన భార్గవి(39) భర్తతో గొడవపడి మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. ఆయా సంఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో గాయాలు

మదనపల్లె : భార్యాభర్తలపై తేనెటీగలు దాడి చేయడంతో గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రబోయనపల్లెకు చెందిన పెద్దన్న(46), అతని భార్య మాధవి(40)తో కలిసి పొలం వద్దకు వెళుతుండగా మార్గ మధ్యంలో అకస్మాత్తుగా తేనెటీగల గుంపు దాడి చేసింది. ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

మదనపల్లె : భూమి వివాదంలో భాగంగా గొడవ పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని వేంపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 221లో గల 2.5 ఎకరాల భూమి విషయమై బార్లపల్లెకు చెందిన షేక్ మస్తాన్, అతని కుటుంబ సభ్యులు, మరో ముగ్గురు కలిసి మదనపల్లె పట్టణం నక్కల దిన్నె మారెమ్మగుడి వద్ద ఉన్న నికలేష్‌తో పాటు ముగ్గురితో భూమి విషయమై ఆదివారం దాడులకు పాల్పడ్డారు. స్థానికులు సమాచారాన్ని తాలూకా పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న తాలూకా పోలీసులు ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

తల్లీకూతుళ్లపై దాడి

మదనపల్లె : తల్లీకూతుళ్లపై పక్కింటి వారు దాడి చేసిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన సునీత (38) ఆమె కుమార్తె శ్రీవాణి(18) ఇంటిలో ఉండగా పక్కింటికి చెందినవారు సునిత ఇంటిలోకి తొంగి చూస్తుండగా శ్రీవాణి ప్రశ్నించింది. దీంతో మాటామాటా పెరిగి ఆమెపై పక్కింటికి చెందిన ముగ్గురు దాడి చేశారు. ఇంతలో విషయం గమనించి సునీత బయటకు వచ్చి ఎందుకు తమ కుమార్తెను కొట్టారంటూ ప్రశ్నించడంతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సహాయంతో బాధితులు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హరి హర అభేద క్షేత్రం పుష్పగిరి


పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రధాన గోపురం


చెన్నకేశవస్వామి మూల విరాట్


వైద్యనాథేశ్వర స్వామి మూల విరాట్

ఈ నెల 29న చందనోత్సవం,
30న అక్షయ తదియ ,
మే 1 న కల్యాణోత్సవాలు, 2 న రథోత్సవాలు,
4 న చక్రస్నానం, పుష్పయాగం

వల్లూరు : జిల్లాలోని ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో పుష్పగిరి ఒకటి. వల్లూరు మండలంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. శివ స్వరూపుడైన వైద్యనాథేశ్వరునికి, విష్ణు స్వరూపుడైన చెన్న కేశవునికి నిలయమైన ఈ క్షేత్రం హరి హర క్షేత్రమై శివ కేశవుల మధ్య అభేదానికి ప్రతీకగా నిలుస్తోంది. భాస్కర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పుష్పగిరిలోని వైద్యనాథ స్వామి ఆలయాన్ని చోళుల కాలంలోను, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని చాళుక్యుల కాలంలోనూ నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం.

శివ కేశవులకు 9 రోజులపాటు బ్రహ్మోత్సవాలు..

సాధారణంగా శైవ క్షేత్రాలలో ఐదు రోజులు , విష్ణు క్షేత్రాలలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం పరిపాటి. కానీ పుష్పగిరిలో శివ కేశవులిద్దరికీ 9 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి కార్యక్రమంలోనూ సాక్షాత్తూ శ్రీరామ చంద్రునిచే పూజలందుకున్న శ్రీ కామాక్షి వైద్యనాథ స్వామికి ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవునికి పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ రాత్రి మొదట వైద్యనాథస్వామికి, అనంతరం శ్రీ చెన్న కేశవ స్వామికి వాహన సేవలు జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలలో 29 వ తేదీన జరిగే చందనోత్సవానికి, 30 న అక్షయ తదియలో భాగంగా జరిగే గరుడ వాహన సేవకు, మే 1 న జరిగే రెండు కల్యాణోత్సవాలకు, 2 న జరిగే రెండు రథోత్సవాలకు, బ్రహ్మోత్సవాల ముగింపు రోజైన 4 వ తేదీన జరిగే చక్రస్నానం, పుష్పయాగాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. భారీ సంఖ్యలో భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలి వస్తారు.

సింహ వాహనంపై వైద్యనాథేశ్వరుడు

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ కామాక్షి వైద్య నాథేశ్వర స్వామి సింహ వాహనంపై, శ్రీ చెన్న కేశవ స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీ వైద్యనాథస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ కామాక్షి అమ్మ వారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చన చేశారు. రాత్రి మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య స్వామి వారి గ్రామోత్సవాన్ని పుష్పగిరి మాడ వీధుల్లో ఘనంగా నిర్వహించారు.

■ కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, తోమాల సేవను నిర్వహించారు. శ్రీ లక్ష్మీదేవికి అర్చనలు జరిపారు. యాగశాలార్చన, చతుస్థానార్చన, నిత్య హోమము, బలిహరణ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం సాయంత్రం వివిధ హోమాలను నిర్వహించారు. రాత్రి హంస వాహనం అధిష్టించిన చెన్న కేశవ స్వామి వారిని కొండపై నుండి పెన్నా నది మీదుగా దివిటీల వెలుగులో గ్రామంలోకి తీసుకుని వచ్చి పుష్పగిరి గ్రామ మాడ వీధులలో మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు కాయ, కర్పూరాలను భక్తితో సమర్పించారు.


సింహ వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి గ్రామోత్సవం


హంస వాహనంపై శ్రీ చెన్న కేశవ స్వామి గ్రామోత్సవం

జెండా దిమ్మె ఏర్పాటుపై కార్మిక సంఘాల గొడవ

మదనపల్లె : మేడే సందర్భంగా జెండా ఎగుర వేసేందుకు దిమ్మె ఏర్పాటు విషయం రెండు యూనియన్ల మధ్య వివాదానికి కారణమైంది. మున్సిపాలిటీలో ఇతర యూనియన్ల జెండా దిమ్మె ఏర్పాటును అంగీకరించేది లేదంటూ ఏఐటీయూసీ నాయకులు అడ్డుకుంటే, ఎలాగైనా జెండా దిమ్మె ఏర్పాటుచేసి తీరుతామంటూ సీఐటీయూ నాయకులు పంతానికి దిగారు. చివరకు రెండు యూనియన్ల మధ్య జెండా దిమ్మె ఏర్పాటుపై మొదలైన వివాదం చిలికి, చిలికి గాలివానగా మారి ఒక వర్గంపై మరొకరు దాడులు చేసుకుని పోలీసు కేసులు పెట్టుకునేంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎట్టకేలకు పోలీసులు జోక్యం చేసుకుని ఆదివారం మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేరని, సోమవారం కమిషనర్ సూచనలతో ఏర్పాటు చేసుకోవాలని సర్దిచెప్పడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. మదనపల్లె మున్సిపాలిటీలో చాలాకాలంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మాత్రమే కార్మిక సంఘం ఉండేది. కొద్దిరోజుల క్రితం ఏఐటీయూసీ నాయకుల ఆధిపత్యం భరించలేక, కార్మికుల్లో కొందరు విడిపోయి సీఐటీయూ యూనియన్‌లో చేరారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య చిన్న చిన్న వివాదాలు జరుగుతుండేవి. ఒక యూనియన్‌లో నుంచి మరో యూనియన్‌లో చేరాల్సిందిగా కార్మికులపై ఒత్తిడి తెచ్చేవారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సీఐటీయూలోకి వెళ్లిన ఇద్దరు పర్మినెంట్, ఇద్దరు ఆప్కాస్ కార్మికులను ఏఐటీయూసీలోకి చేర్చుకున్నారు. ఇదిలాఉంటే.. మే1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా.. మున్సిపల్ కార్యాలయ ప్రహరీకి ఆనుకుని జెండా దిమ్మె ఏర్పాటు చేసుకునేందుకు సీఐటీయూ నాయకులు సామగ్రి తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, సురేష్, ముబారక్, సాంబశివ, పృథ్వీరాజ్, అశోక్, ఓబులేసు తదితరులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సీఐటీయూ అనుబంధసంఘం కోశాధికారి రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వన్‌టౌన్ ఎస్‌ఐ శివకుమార్ ఘటనాస్థలానికి చేరుకుని, రెండు యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించి జెండా ఏర్పాటుచేసుకోవాలని, అంతవరకు ఎవరూ తొందరపాటు చర్యలకు పాల్పడవద్దన్నారు.


రెండు యూనియన్ల నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న దృశ్యం

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రాజంపేట : పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు సమీపంలో మన్నూరు అరుంధతీవాడకు చెందిన ఎం.రమణయ్య(68) ఆదివారం వడ దెబ్బతో మృతి చెందారు. భవన నిర్మాణ కార్మికునిగా పనిచేసేవాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీసీ కెమెరాల చోరీ

కలకడ : మండలంలోని గుర్రంకొండ రోడ్డు మార్గం పక్కన ఉన్న కలకడ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దుండగులు చోరీ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలీ తెలిపారు. వాచ్‌మెన్ రామాంజులు రాత్రి భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు 2 సీసీ కెమెరాలను చోరీ చేశారన్నారు.

నీరు విడుదల చేసిన మంత్రి

చిన్నమండెం : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి హరితతో కలిసి చిన్నమండెం మండలం బోనమల నాగూరువాండ్లపల్లె, బోనమల దళితవాడకు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. బోనమల గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

కురబలకోటలో చోరీ


చోరీ జరిగిన దృశ్యం

కురబలకోట : కురబలకోట జెడ్పీ హైస్కూల్ సమీపంలో కువైట్ మస్తాన్ ఇంటిలో ఆదివారం చోరీ జరిగింది. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు అందిన ఫిర్యాదు మేరకు.. కురబలకోట మస్తాన్ స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలో కొత్తగా కట్టిన ఇంటిలో నివాసం ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా తిరుపతి ఆసుపత్రికి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చి ఇంట్లో బీరువా చూస్తే బంగారం, కువైట్‌కు చెందిన కరెన్సీ కన్పించలేదు. దీంతో బాధితుడు అదే రోజు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 600 గ్రాముల బంగారంతో పాటు దుబాయ్‌కు చెందిన కరెన్సీ పోయినట్లు బాధితుడు తెలిపాడు. చోరీ ఘటనలో తెలిసిన వారి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని ఎస్‌ఐ తెలిపారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

జలాశయంలో ఈతకు వెళ్లి వ్యక్తి దుర్మరణం

మైలవరం : వేముల మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఇబ్రహీం (53) అనే వ్యక్తి మైలవరం జలాశయంలో ఈతకు వెళ్లి ఆదివారం సాయంత్రం దుర్మరణం చెందాడు. మైలవరం పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములకు చెందిన షేక్ ఇబ్రహీం జమ్మలమడుగు పట్టణంలో జరిగే హజరత్ సయ్యద్ షా గూడుమస్తాన్ వలీ ఉరుసు ఉత్సవానికి వేముల నుంచి శనివారం గూడెంచెరువు గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మైలవరం మండలంలోని గైబుసా స్వామి కొండకు వెళ్లి అక్కడ చదివింపులు చేసుకుని మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులతో కలసి మైలవరం జలాశయానికి వచ్చాడు. జలాశయంలో ఈతకు వెళ్లి అక్కడి మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు.

వైఎస్.షర్మిలపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి


మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు ఆదివారం మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విజయవాడలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్.షర్మిల మాట్లాడుతూ దేశంలో ఇంటర్నల్ టెర్రరిజాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ ప్రోత్సహిస్తున్నారని, మోదీ టెర్రరిస్ట్ అంటూ మాట్లాడారన్నారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్ ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే విధంగా ఉన్నాయని, ఆమెపై దేశద్రోహం చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుచేసిన వారిలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, జర్మనీ రాజు, కిరణ్ కుమార్, నాగరాజు, వెంకటరాజు, సాయిప్రసాద్, శ్రీకాంత్, పిల్లస్వామి నాయక్, మధుసూధన్‌రావు, శరత్ ఉన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన జ్యోతీష్

మదనపల్లె : కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం కళత్తూరు పంచాయతీ గళ్లవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు జ్యోతీష్ (25) మదనపల్లెలోని ఓ హోటల్‌లో కిచెన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. సొంత పనులపై స్వగ్రామానికి వెళ్లి తిరిగి ఆదివారం ద్విచక్రవాహంలో వస్తుండగా మార్గమధ్యంలోని ముత్తుకూరు క్రాస్ వద్ద పుంగనూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో జ్యోతీష్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సంబంధింత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మాన్ నగర్‌లో రౌడీల వీరంగం


రౌడీల చేతిలో గాయపడిన బాధితుడు

రాజంపేట : పట్టణంలోని ఉస్మాన్ నగర్‌లో శనివారం రాత్రి కొంతమంది రౌడీలు వీరంగం సృష్టించారు. రౌడీల దాడిలో గాయపడిన వెంకటరమణ, కొడుకు రెడ్డయ్యలను చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. సీసీ కెమెరా ల్లో దాడి దృశ్యాలు రికార్డయ్యాయి. రౌడీ మూకలు సీసీ కెమెరాలు పగులగొట్టారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజా తెలిపారు.

మంగంపేట బెరైటీస్ గనులు తాకట్టు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్ : మంగంపేట బెరైటీస్ గనులను ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 9 వేల కోట్ల అప్పు కోసం తాకట్టుపెట్టి ఇక్కడి ఖనిజ సంపదపై ప్రైవేటు వారికి హక్కు కల్పించి రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలకు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగంపేట గనులు కోడూరు ప్రజల ఆస్తి అని వాటి జోలికి వస్తే ఒక ఇంచ్ కూడా తీసుకోలేరని హెచ్చరించారు. ఇంత జరుగుతున్నా రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన మేధావులు అని చెప్పుకునే కూటమి నాయకులు ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. మంగంపేట గనులపై ప్రభుత్వం పెత్తనం చెలాయించి అప్పులు చేస్తే తీవ్ర ప్రజా ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.

కూటమి నేతల పంచాయితీ.. పంది మాంసం కేసు మాఫీ

- రూ. 63 వేలు వసూలు చేసేలా అధికారపార్టీ నేతల తీర్మానం
- జరిమానాతో సరిపెట్టిన అటవీశాఖ అధికారులు

గుర్రంకొండ : వేటగాళ్లు కరెంటు తీగలతో వేటాడిన అడవి పంది మాంసం విక్రయాలకు సంబంధించిన కేసు మాఫీ కోసం రూ.63 వేలు చెల్లించాల్సిందిగా అధికార పార్టీనేతలు తీర్మానం చేశారు. వీరికి సహకరిస్తూ అటవీశాఖ అధికారులు తానా తందానా అంటూ కేవలం మాంసం విక్రేతకు జరిమానా విధించి చేతులు దులుపుకొన్న సంఘటన మండలంలోని తరిగొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం ఎనుగొండపాళెం పంచాయతీ కుమ్మరపల్లె గ్రామానికి చెందిన ఓ వేటగాడు అడవి జంతువులను వేటాడమే జీవనాధారంగా చేసుకొని లక్షలాది రూపాయలు గడించాడు. కరెంటు తీగలతో వేటాడే అడవి పందుల మాంసాన్ని గుర్రంకొండ, తరిగొండ, మదనపల్లె, పుంగనూరు ప్రాంతాలకు సరఫరా చేసేవాడు. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల క్రితం కుమ్మరపల్లెలో ఓ అడవి పందిని వేటాడాడు. గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సదరు వేటగాడి వద్ద నుంచి అడవిపంది మొత్తాన్ని కొనుగోలు చేసి ద్విచక్రవాహనంలో గ్రామానికి తీసుకొచ్చారు. అదే రోజు అడవిపంది మాంసాన్ని గ్రామంలో విక్రయించారు. మాంసాన్ని కొనుగోలు చేసిన కొంతమంది అధికార పార్టీ నేతలు గుట్టుచప్పుడు కాకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు వెంటనే తరిగొండకు చేరుకొని ముగ్గురు మాంసం విక్రేతలను ద్విచక్రవాహనంతో సహా అదుపులోకి తీసుకొని వాల్మీకిపురం తరలించారు. అయితే ఆ తర్వాత అటవీశాఖ అధికారులు, అధికారపార్టీ నేతలు కలిసి ఈ కేసు విషయమై పంచాయితీ చేశారు. ఈ పంచాయితీలో వారందరు కలసి సదరు మాంసం విక్రేతల దగ్గర నుంచి రూ. 63 వేలు వసూలు చేసినట్లు గ్రామస్తుల సమాచారం. అక్కడి నుంచి కుమ్మరపల్లెకు చేరుకొని అడవి పందిని వేటాడిన వేటగాడిని మందలించి వదిలి పెట్టినట్లు తెలిసింది. ఈ విషయం రెండు రోజులుగా మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇందులో అధికార పార్టీ నేతల వాటా ఎంత, అటవీశాఖ అధికారుల వాటా ఎంత అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై మర్రిపాడు బీట్ ఆఫీసర్ వరదారెడ్డిని వివరణ కోరగా కుమ్మరపల్లెలో వేటగాడు అడవి పందిని వేటాడి తరిగొండకు చెందిన ముగ్గురు వ్యక్తులకు విక్రయించిన విషయం వాస్తవమన్నారు. ఈ కేసుకు సంబంధించి మాంసం విక్రేతలు ముగ్గురికి జరిమానా విధించామన్నారు. తాము వారి నుంచి డబ్బులు వసూలు చేయలేదన్నారు. ద్విచక్రవాహనాన్ని సోమవారం వారికే అప్పగిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ విజేత అన్నమయ్య జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన అన్నమయ్య జిల్లా బాల, బాలికల జట్టుతో ఎమ్మెల్యే, కోచ్‌లు

మదనపల్లె సిటీ : స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్ట పాఠశాలలో ఆదివారం జరిగిన 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల,బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో అన్నమయ్య జిల్లా బాల,బాలికల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గెలుపు, ఓటములు సహజమని ఓడినా, గెలిచినా సమానంగా తీసుకోవాలన్నారు. తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు అన్ని జిల్లాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నామని రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు తెలిపారు. పోటీల నిర్వాహకులు నరేష్‌బాబు, గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, పీడీలు గురు, బాలాజీ, గురుభాస్కర్, అంజనప్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలికల విభాగంలో ప్రథమ స్థానం అన్నమయ్య జిల్లా, ద్వితీయ స్థానం చిత్తూరు జిల్లా, తృతీయ స్థానం తిరుపతి జిల్లా, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానం అన్నమయ్య జిల్లా, ద్వితీయ స్థానం ఏలూరు జిల్లా, తృతీయస్థానం చిత్తూరు జిల్లా, నాలుగో స్థానం సత్యసాయి జిల్లా జట్లు సాధించాయి.

బరువెక్కిన గుండెతో అంత్యక్రియలు


మృతదేహాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : చెరువులో మునిగి మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు ఆదివారం ములకలచెరువులో బరువెక్కిన హృదయాలతో జరిగాయి. ఇద్దరు చిన్నారులకు తోడుగా వచ్చి మృతి చెందిన మరో చిన్నారి నందిత అంత్యక్రియలు కర్నాటక రాష్ట్రం కైవరమ్ క్రాస్‌లో జరిగాయి. నీళ్లలోకి దిగి నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. ములకలచెరువులో జరిగిన ముగ్గురి అంత్యక్రియలకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరయ్యారు. మృతులకు నివాళులు అర్పించారు. నలుగురికి రూ. 1.75 లక్షల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు కూడా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాధవరెడ్డి, నాయకులు అన్సర్‌బాషా, సిద్దారెడ్డి, చాంద్‌బాషా, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల సమస్యను పరిష్కరించండి


లారీ డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీలో లారీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏపీఎండీసీ బెరైటీస్ ప్రాజెక్టులో డిస్పాచ్‌లో 400 మందికి పైగా డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం మంచినీరు కూడా డ్రైవర్లకు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, డ్రైవర్ల సంఘం యూనియన్ నాయకులు నాగార్జున, మహేంద్ర, సుబ్రమణ్యం, సీఐటీయూ నాయకుడు సిహెచ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెట్టిన ఆకతాయిలు


సిద్దవటం బీటులో చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజి పరిధిలోని మద్దూరు, సిద్దవటం బీట్‌లలో ఆకతాయిలు శనివారం సాయంత్రం అడవికి నిప్పు పెట్టారు. అటవీ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఫారెస్టు రేంజి పరిధిలోని మద్దూరు, సిద్దవటం బీట్లలో ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. అటవీ సిబ్బంది అప్రమత్తమై మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారని తెలిపారు. అటవీ ప్రాంతం పచ్చదనంతో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేస్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు పెంచల్‌రెడ్డి, దీపిక, మధు, ఆది విశ్వనాథ్, ఏబీఓలు హైమావతి, నారాయణరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పాకిస్తానీయుల తరలింపులో ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపు

మదనపల్లె : పట్టణంలో పాకిస్తాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు వ్యక్తుల తరలింపులో ప్రభుత్వ ఆదేశాల కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో పాకిస్తాన్ పౌరులు ఎక్కడ ఉన్నా గుర్తించి వారందరినీ వారి దేశానికి తిరిగి పంపించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశించిన విషయం తెలిసిందే. ఇతర వీసాలపై భారత్ వచ్చిన పాకిస్తాన్ పౌరులు ఈనెల 27వ తేదీ నాటికల్లా దేశం విడిచి వెళ్లిపోవాలని, వైద్యసేవల నిమిత్తమై మెడికల్ వీసాపై వచ్చిన పాకిస్తానీయులు ఈనెల 29వ తేదీకల్లా దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలకు ఈ నిబంధనలు వర్తించవని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పేర్కొన్న నేపథ్యంలో పోలీసులు మదనపల్లె పాకిస్తానీయుల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి ఉన్నారు.